సాక్షి
విశాఖపట్నం
ఆదివారం । 12 । మార్చి । 2023



తొలిరోజే జగనన్న కానుక!
2023-24 విద్యా సంవత్సరంలో బడి తెరిచే రోజునే జగనన్న విద్యాకానుక కిట్లు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. 11లో



విద్యార్థులకు ఆర్టీసీ గుడ్ న్యూస్
ఇంటర్, పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్టీసీ ఉచిత ప్రయాణానికి నిర్ణయం తీసుకుంది. 11లో



'వేదిక'పై సిటీ టాలెంట్
నగర వాసుల్లో ప్రతిభను వెలికితీసేందుకు బైజాగ్ గాట్ టాలెంట్ పేరుతో నిర్వహిస్తున్న వేదిక కార్యక్రమాలు అలరిస్తున్నాయి. 11లో

న్యూస్‌రీల్

ముడసర్లోవ రిజర్వాయర్ వద్ద ప్రత్యేక నిఘా



ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న సీపీ శ్రీకాంత్, పోలీస్ అధికారులు

ఆరిలోవ/మధురవాడ: ముడసర్లోవ రిజర్వాయర్‌లో జీవీఎంసీ ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్‌ను నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్ శనివారం సందర్శించారు. జీ–20 సమ్మిట్‌కు వస్తున్న వివిధ దేశాల ప్రతినిధులు ఇక్కడి ప్లాంట్‌ను సందర్శించనున్నారు. ఈ నేపథ్యంలో పోలీస్ అధికారులతో సందర్శించిన సీపీ ఇక్క డ రహదారులు, పరిసరాలను పరిశీలించారు. ఈ ప్రాంతంలో ప్రత్యేక సిబ్బందితో నిఘా ఏర్పాటు చేయాలని ద్వారకా ఏసీపీ మూర్తిని ఆదేశించారు. ఈ మార్గంలో రోజూ పోలీస్ బీట్ నిర్వహించాలన్నారు. మధురవాడ సమీపంలోని కాపులుప్పాడ డంపింగ్ యార్డును సీపీ సందర్శించారు. ఇక్కడ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రత, ట్రాఫిక్, పార్కింగ్ తదితర అంశాలపై పోలీస్ అధికారులతో సమీక్షించారు. డీసీపీ–1 సునీల్ సుమిత్, డీసీపీ–2 కె.ఆనందరెడ్డి, ఏడీసీపీ డి.గంగాధర్ పాల్గొన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ



కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

తాటిచెట్లపాలెం: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సీపీ ఆదేశాల మేరకు నగరంలో ఆరు చోట్ల చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. శనివారం రాత్రి వరకు సుమారు 2,500 వాహనాలను తనిఖీలు చేసినట్లు పోలీసులు తెలిపారు. నగరంలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోనూ ఈ తనిఖీలు కొనసాగుతున్నాయి.

నేటి నుంచి ప్రపంచ గ్లకోమా వారోత్సవాలు

సీతంపేట (విశాఖ ఉత్తర): ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు గ్లకోమా వారోత్సవాలు నిర్వహించనున్నట్టు ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్య శాల సంయుక్తంగా నిర్వహిస్తున్న వారోత్సవాలలో భాగంగా గ్లకోమా వ్యాధి నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 13న ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో గ్లకోమా స్క్రీనింగ్, 14, 15 తేదీల్లో ఎంపిక చేసిన పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో కంటి పరీక్షలు, 16న యలమంచిలి ప్రభుత్వ ఆస్పత్రిలో కంటి పరీక్షలు, 17న రేడియో టాక్, 18న వారోత్సవాల ముగింపు సభ, ర్యాలీ జరుగుతుందని వెల్లడించారు.

పట్టభద్రుల పోలింగ్‌కు సర్వం సిద్ధం

- 37 మంది అభ్యర్థులు.. 2,89,214 మంది ఓటర్లు
- రేపు ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్
- ఆరు జిల్లాల పరిధిలో 331 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- 2,038 మంది పోలింగ్ సిబ్బంది, అధికారుల పర్యవేక్షణ
- 840 మంది పోలీసుల భద్రతలో పోలింగ్ నిర్వహణ
- మన్యం, అల్లూరి జిల్లాల పోలింగ్ స్టేషన్లలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్
- 'సాక్షి'తో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, విశాఖ కలెక్టర్ మల్లికార్జున



స్వర్ణభారతి స్టేడియంలో పోలింగ్ మెటీరియల్ పంపిణీ ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఆరు జిల్లాల పరిధిలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు పూర్తి చేశామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం కలెక్టర్ డా.మల్లికార్జున తెలిపారు. శనివారం సాయంత్రం 4 గంటలతో ఎన్నికల ప్రచారం ముగిసిన నేపథ్యంలో అన్ని ప్రాంతాల్లోనూ ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలు చేసేందుకు అధికారులతో పహారా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 13న జరిగే పోలింగ్ కోసం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లోని 331 పోలింగ్ స్టేషన్లకు సామగ్రితో పాటు, ఎన్నికల సిబ్బందిని పంపించినట్లు 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తెలిపారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో స్ట్రైకింగ్ ఫోర్స్

ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని చర్యలూ చేపట్టాం. అభ్యర్థులు పోలింగ్ సమయంలో ఏం చేయకూడదనే అంశంపై శనివారం సాయంత్రం చివరి సమావేశం ఏర్పాటు చేసి నిబంధనలు వివరించాం. మొత్తం ఆరు జిల్లాల పరిధిలో 34 ఆక్సిలరీ స్టేషన్లతో కలిపి మొత్తం 331 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశాం. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పార్వతీపురం మన్యం పరిధిలో 12, అల్లూరి జిల్లాలో 15 సమస్యాత్మక పోలింగ్‌స్టేషన్లలో స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్‌ఫోర్స్, పారామిలటరీ దళాలను వినియోగిస్తున్నాం. ప్రతి పోలింగ్‌స్టేషన్‌లోనూ వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు చేశాం.

ఏ పోలింగ్ స్టేషన్.. సిబ్బందికి తెలియదు

ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న 2,038 మంది సిబ్బందికి రెండు విడతల్లో శిక్షణ తరగతులు నిర్వహించాం. పోలింగ్ సమయంలో ఏ విధంగా విధులు నిర్వర్తించాలి, బ్యాలెట్ బాక్సులను ఎలా భద్రపరిచి స్ట్రాంగ్ రూమ్‌కి తీసుకురావాలి. కౌంటింగ్ సమయంలో ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై శిక్షణ పూర్తయింది. సిబ్బందికి ఎన్నికల విధులు అప్పగించే విషయమై రెండు సార్లు ర్యాండమైజేషన్ తయారు చేసి గ్రూప్‌లుగా విభజించాం. ఏ జిల్లా పరిధిలో పని చేస్తారనేది తెలియజేశాం. కానీ ఎవరు ఏ పోలింగ్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వర్తించాలన్నది ఆదివారం తెలియజేసిన వెంటనే విధులకు బయలుదేరనున్నారు. ప్రతి జిల్లాలోనూ డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, రిసెప్షన్ సెంటర్లు ఏర్పాటు చేశాం. ఓటింగ్ పూర్తయిన తర్వాత ఎంత ఆలస్యమైనా అదే రోజు బయలుదేరి విశాఖలో ఏర్పాటు చేసిన మెయిన్ స్ట్రాంగ్‌రూమ్ స్వర్ణభారతి స్టేడియంకి భద్రత నడుమ బ్యాలెట్ బాక్సులు తీసుకురావాలి. ఇక్కడ ప్రతి జిల్లాకో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేశాం. వాటిలో బ్యాలెట్ బాక్సులను భద్రపరచాలి.

బ్యాలెట్ బాక్సులు, పత్రాల పంపిణీ ఇలా..

జిల్లా	బ్యాలెట్ బాక్సులు	బ్యాలెట్ పత్రాలు
శ్రీకాకుళం	292	54,200
విజయనగరం	229	60,600
పార్వతీపురం మన్యం	62	19,300
విశాఖపట్నం	18	12,000
అల్లూరి సీతారామరాజు	358	1,09,400
అనకాపల్లి	160	44,200
రిజర్వ్	--	5,325
మొత్తం	1119	3,05,025

అన్నీ పెద్ద బ్యాలెట్ బాక్సులే..

ఆరు జిల్లాల పరిధిలో మొత్తం 1, 119 బ్యాలెట్ బాక్సులు వినియోగిస్తున్నాం. అన్నీ పెద్ద బాక్సులు మాత్రమే వాడుతున్నాం. 200 నుంచి 600 మధ్యలో ఓటర్లున్న స్టేషన్లలో రెండు బాక్సులు, 600 నుంచి 1100 మధ్యలో ఉంటే మూడు బాక్సులు, 1100 దాటిన పోలింగ్ స్టేషన్లలో 4 బాక్సులు వినియోగిస్తున్నాం. అన్ని బ్యాలెట్ బాక్సులకు ప్రత్యేక కోడ్ ఏర్పాటు చేశాం.

జిల్లాల వారీగా ఓటర్లు, పోలింగ్ స్టేషన్ల వివరాలు

జిల్లా	పోలింగ్ స్టేషన్లు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	ఇతరులు	మొత్తం
శ్రీకాకుళం	59	36,411	15,840	05	52,256
విజయనగరం	72	38,625	19868	09	58502
పార్వతీపురం మన్యం	24	12,516	6,002	02	18,520
అల్లూరి సీతారామరాజు	15	7861	3661	03	11,525
విశాఖపట్నం	112	58,364	47320	13	1,05,697
అనకాపల్లి	49	28,370	14,338	06	42,714
మొత్తం	331	1,82,147	1,07,029	38	2,89,214

5,325 బ్యాలెట్ పత్రాల్లో ముద్రణ లోపాలు

బ్యాలెట్ పేపర్లు, రిజర్వ్ సంఖ్యతో కలిపి ఇప్పటికే పంపిణీ పూర్తి చేశాం. కర్నూలులో ప్రింట్ పూర్తయి వచ్చిన ప్రతి బ్యాలెట్ పత్రాన్ని పరిశీలించాం. ఇందులో 5,325 డిఫెక్టివ్ బ్యాలెట్ పత్రాలు వచ్చాయి. అంటే ఈ బ్యాలెట్ పత్రాల్లో పేర్లు ఉన్నాయి కానీ.. సీరియల్ నంబర్లు లేవు. 1 నుంచి 31 వరకు సీరియల్ నంబర్లు ముద్రించలేదు. వీటిని పక్కన పెట్టి ఈ అంశంపై చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు లేఖ రాశాం. వాటిని ఏం చేయాలన్న అంశంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఈ బ్యాలెట్ పత్రాలు తీసేసినప్పటికీ.. సరిపడా ఉన్నాయి. ఫారం–12 ప్రకారం పోస్టల్ బ్యాలెట్ కోసం 1,214 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటివరకు 748 మందికి పోస్టల్ బ్యాలెట్‌లు పంపించాం. ఆదివారం కూడా మరికొందరికి పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఓటరు స్లిప్పుల పంపిణీ దాదాపు 95.91 శాతం పూర్తయింది. ఆబ్సెంట్, డూప్లికేట్, షిఫ్టింగ్ మొదలైన ఓటర్ల జాబితాలను ఆయా పోలింగ్ స్టేషన్ల ప్రిసైడింగ్ అధికారులకు పంపిస్తాం.

48 గంటలు డ్రై డే

శనివారం సాయంత్రం 4 గంటల నుంచి 13వ తేదీ పోలింగ్ ముగిసే సాయంత్రం 4 గంటల వరకూ 6 జిల్లాల్లోనూ డ్రై డే నిర్వహిస్తున్నాం. ఈ 48 గంటల పాటు ఎక్కడా మద్యం అమ్మకాలు చేపట్టకూడదు. పోలింగ్ సెంటర్లు, కౌంటింగ్ సెంటర్లు ఏర్పాటు చేసిన ఇన్‌స్టిట్యూట్‌లు, కార్యాలయాలకు 12, 13 తేదీల్లో సెలవులుగా ప్రకటించాం. కౌంటింగ్ సమయంలో లోకల్ హాలిడేలు కూడా ఇవ్వాలని నిర్ణయించాం. ఓటు వేసే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు పోలింగ్ రోజున స్పెషల్ క్యాజువల్ లీవ్‌ను వినియోగించుకోవచ్చు. ప్రైవేట్ సంస్థల్లో పని చేసే వారిలో ఎవరికి ఓటు హక్కు ఉందో వారి షిఫ్ట్‌లో మార్పులు చేయడం, లేదా ఓటు వేయడానికి అనుమతి ఇవ్వడం చేయాలని ఆదేశించాం.

పకడ్బందీగా ఏర్పాట్లు

ప్రతి జిల్లాలోనూ బందోబస్తు పటిష్టంగా నిర్వహించాం. ఇప్పటివరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి నాలుగు ఫిర్యాదులు వచ్చాయి. వాటికి సంబంధించిన నివేదికలు సమర్పించాం. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీగా పోలింగ్ నిర్వహించనున్నాం. ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ ఓటరు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా బూత్‌ల వద్ద ఏర్పాట్లు చేశాం.

డిగ్రీ సర్టిఫికెట్‌తో కూడా..

గ్రాడ్యుయేట్ ఓటర్లు ఎన్నికల కమిషన్‌కు సంబంధించి ఎపిక్ కార్డు/ఆధార్ కార్డు/డ్రైవింగ్ లైసెన్స్/పాన్‌కార్డు/పాస్‌పోర్టు చూపించి ఓటు వేసుకోవచ్చు. కేవలం ఎపిక్ కార్డు ఉండాలన్న నిబంధనలేమీ లేవు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రైవేట్ ఉద్యోగులు కూడా తమ సర్వీస్ ఐడెంటిటీ కార్డు చూపించి ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తున్నాం. ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ అఫీషియల్ ఐడీ కార్డు చూపించి ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. ఇవేమీ లేకపోయినా డిగ్రీ సర్టిఫికెట్ తీసుకొచ్చి చూపించి కూడా ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తున్నాం. దివ్యాంగులు కూడా ఆ ఐడీ కార్డు చూపించి ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. 13వ తేదీ సాయంత్రం 4 గంటల్లోపు పోలింగ్ స్టేషన్ లోపలికి వచ్చే వారికి మాత్రమే ఓటు వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తాం.

- 6 జిల్లాల పరిధిలో 75 రూట్లలో పోలింగ్ సిబ్బందిని తరలించేందుకు 66 బస్సులు ఏర్పాటు చేశారు.
- శ్రీకాకుళం జిల్లా పరిధిలో 383 మంది, విజయనగరంలో 455, మన్యంలో 145, అల్లూరిలో 94, విశాఖపట్నంలో 657, అనకాపల్లిలో 304 మంది చొప్పున మొత్తం 2,038 మంది ఎన్నికల విధులు నిర్వర్తించనున్నారు.
- ఆరు జిల్లాల పరిధిలో 393 పీవోలు, 394 మంది ఏపీవోలు, 848 ఓపీవోలు, 403 మంది మైక్రో అబ్జర్వర్లు పోలింగ్‌ను పర్యవేక్షించనున్నారు.
- శ్రీకాకుళంలో 899 మంది, విజయనగరంలో 1063, మన్యంలో 396, అల్లూరిలో 230 మంది, విశాఖపట్నంలో 1142, అనకాపల్లిలో 691 మంది చొప్పున మొత్తం 4,420 మంది పోలీసులు పహారా కాస్తున్నారు. వీరితో పాటు 8 పీఎల్‌టీలు, 10 పార్టీలు, ఒక ఏపీఎస్‌పీ బృందం, 4 సెక్షన్ ఎస్ఏపీ బృందాలు విధులు నిర్వర్తించనున్నాయి.
- 2017 ఎన్నికల్లో 1,55,930 మంది ఓటర్లుండగా 1,08,857 మంది పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 69.78 శాతం పోలింగ్ నమోదైంది.

బ్యాలెట్‌పై తొలి ప్రాధాన్య ఓటు తప్పనిసరి

- లేదంటే చెల్లని ఓటుగా పరిగణిస్తాం
- అభ్యర్థులతో ఆర్వో మల్లికార్జున

సాక్షి, విశాఖపట్నం: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ జరిగే 13వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు రాజకీయ స్వభావంతో కూడిన సందేశాలు పంపడం, ఫోన్ కాల్స్ ద్వారా ప్రచారం నిర్వహించొద్దని రిటర్నింగ్ అధికారి డా.మల్లికార్జున అభ్యర్థులకు సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం సాయంత్రం పోలింగ్, ఎన్నికల నియమావళిపై బరిలో ఉన్న 37 మంది అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. బల్క్ మేసేజ్‌ల పేరుతో ఉల్లంఘన జరిగితే ఎన్నికల నేరంగా పరిగణించి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం ఓటింగ్ వేసే విధానాన్ని అభ్యర్థులకు వివరించారు. బ్యాలెట్‌పై తొలి ప్రాధాన్య సంఖ్య ఒకటి తప్పనిసరిగా వేయాలని, లేదంటే ఆ ఓటు చెల్లనదిగా పరిగణిస్తామన్నారు. ఎన్నికల సిబ్బంది ఇచ్చిన వయొలెట్ రంగు స్కెచ్ పెన్‌తో మాత్రమే నంబర్లు వేయాలన్నారు. అభ్యర్థులు పోలింగ్ ఏజెంట్ల కోసం సంబంధిత పోలింగ్ కేంద్రంలో 12వ తేదీ సాయంత్రం నుంచి ఫారం–10 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కౌంటింగ్ ఏజెంట్ల కోసం ఫారం–18 ద్వారా రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

సాక్షి, విశాఖపట్నం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు ఆర్వో మల్లికార్జున తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ నెల 13న నిర్వహించే ఎన్నికల కోసం సర్వం సిద్ధమైందన్నారు. 16వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. సీపీ మాట్లాడుతూ నగరంలోని 43 ప్రదేశాల్లో 112 పోలింగ్ కేంద్రాల్లో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టినట్లు వివరించారు. ముగ్గురు డీసీపీలు, ఇద్దరు ఏడీసీపీలు, 10 మంది ఏసీపీలు, 21 మంది సీఐలు, 83 మంది ఎస్ఐలు, సిబ్బంది కలిపి మొత్తం 1,200 మందిని బందోబస్తు కోసం వినియోగిస్తున్నట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సీఆర్‌పీసీ, సెక్షన్ 30 పోలీస్ చట్టం అమలులో ఉంటుందని స్పష్టం చేశారు.

సక్రమంగా మెటీరియల్ పంపిణీ

సీతంపేట: ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ మెటీరియల్ పంపిణీ సక్రమంగా చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. స్వర్ణభారతి స్టేడియంలో సోమవారం పోలింగ్ మెటీరియల్ పంపిణీ కౌంటర్లు, సీసీ కెమెరాల ఏర్పాట్లు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాధవి, తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

ఇన్వెస్టర్స్ సమ్మిట్ చూసి కళ్లు తెరవాలి

- విశాఖ వేదికగా పెట్టుబడులు పెడతామని పారిశ్రామికవేత్తలు ప్రకటించారు
- చంద్రబాబు అధికారంలో ఉన్నంత కాలం స్కాంలు, భూ దోపిడీలే..
- ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



గుంటూరులో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

పట్నంబజారు: విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ చూసి కూడా ప్రతిపక్షాలు కళ్లు తెరవాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. గుంటూరులో వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యులు తాడిశెట్టి మురళీ మోహన్ నివాసానికి విచ్చేసిన ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో భారతదేశంలో పేరుగాంచిన పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి వచ్చి పెట్టిన పెట్టుబడులు గమనించాలన్నారు. పరిశ్రమలు నెలకొల్పేందుకు, పారిశ్రామికంగా ఏపీ అన్ని విధాలుగా అనుకూలంగా ఉందని, రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని, తాము పెట్టుబడులు పెడతామని పారిశ్రామికవేత్తలు ప్రకటించిన విషయాన్ని గమనించాలన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తాను అధికారంలో ఉన్నంత కాలం ఎలా స్కామ్ చేయాలి, భూములు ఎలా దోచుకోవాలి, డబ్బులు ఎలా కొట్టేయాలో అనే ఆలోచనలతో బుర్ర పనిచేసిందన్నారు. ఇటీవల స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి కోట్లాది రూపాయల స్కాంలో ఈడీ 10 మందిని అరెస్ట్ చేస్తే.. నోరు ఎత్తి మాట్లాడలేని చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని వ్యాఖ్యానించటం హాస్యాస్పదంగా ఉందన్నారు. రేపో మాపో ఆయన కూడా వెళ్లిపోవటానికి సిద్ధంగా ఉన్నాడని చెప్పారు. రాబోయే రోజుల్లో విశాఖ నుంచి పరిపాలన చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి చెప్పారని, మరెవరికైనా అనుమానాలు ఉంటే భగవంతుడే కాపాడాలని వ్యాఖ్యానించారు.

సహజీవనం మన సంస్కృతి కాదు

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్



జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్‌ను సత్కరిస్తున్న వీసీ సూర్యప్రకాష్

సబ్బవరం : సహజీవనం మన సంస్కృతి కాదు..వివాహానికి ముందే కలిసి జీవిస్తే ఒకరికొకరు అర్థం చేసుకుంటారన్న వాదనలో నిజం లేదని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ అన్నారు. దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయంలో సెంటర్ ఫర్ వుమన్ అండ్ చైల్డ్ లా ఆధ్వర్యంలో సహజీవనం–వివాహం, వివాహ చట్టాలపై ప్రభావం అనే అంశాలపై శనివారం జాతీయ సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మానవేంద్రనాథ్ రాయ్ హాజరై మాట్లాడారు. స్వేచ్ఛ, ఆర్థికాభివృద్ధి అనే పేరుతో యువత పక్కదారి పడుతోందన్నారు. విదేశీ సంస్కృతి భిన్నమైనదని, మన దేశంలో పూర్వం ఇలాంటి సంబంధాలు లేవన్నారు. ఇటువంటి సంబంధాల రక్షణ కోసం పటిష్టమైన చట్టాలు అమలు చేయాలని పేర్కొన్నారు. 1927, 1951లో స్త్రీల రక్షణ కోసం ప్రివ్యూ కౌన్సిల్, సుప్రీం కోర్టు తీర్పులు వెలువరించాయని గుర్తు చేశారు. వర్సిటీ వీసీ డాక్టర్ ఎస్. సూర్యప్రకాష్ మాట్లాడుతూ నేటి సమాజంలో చాలామంది యువతీ యువకులు సహజీవనం అనే కొత్త ఒరవడివైపు ఆకర్షితులవుతున్నారన్నారు. వివాహం అనేది భారతదేశ సంప్రదాయమన్న విషయం మరిచిపోతున్నారని చెప్పారు. దేశంలో ఇటీవల జరిగిన శ్రద్ధావాకర్ సంఘటనను వివరిస్తూ వివాహం అనే బంధం లేకుండా కలిసి జీవించాలనుకుంటే జంటలు చాలా విషయాలపై ఆలోచించాలన్నారు. ఇటీవల అలహాబాద్ హైకోర్టులో సహజీవన బాధితురాలు వేసిన పిటీషన్‌ను విచారిస్తూ సహజీవన బంధాలు చాలా ప్రమాదకరమైనవని, మహిళలకు రక్షణ లేదని వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. సెంటర్ ఫర్ ఉమెన్ అండ్ చైల్డ్ లా కన్వీనర్ ఆచార్య విజయలక్ష్మి సెమినార్ ఉద్దేశ్యాన్ని వివరించారు. పలు విద్యాలయాల నుంచి 60 మంది వరకూ ఆచార్యులు, సహ ఆచార్యులు హాజరయ్యారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కె.మధుసూదనరావు, ఆచార్య రాజేంద్రప్రసాద్, డాక్టర్ దయానందమూర్తి, ఆచార్య అరుణ, సెమినార్ కో కన్వీనర్ డాక్టర్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

అత్తను హత్య చేసిన అల్లుడు

ఆరిలోవ(విశాఖ తూర్పు): ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వృద్ధురాలు హత్యకు గురైంది. అడిగిన డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో అత్తను అల్లుడు హత్య చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమంతవాక దరి విజయదుర్గా కాలనీలో కొండపై బాణాల రాము అలియాస్ కరెంట్ రాము భార్య లక్ష్మి, ఆరేళ్ల కుమారుడితో నివాసముంటున్నాడు. అతని భార్యకు అనారోగ్యం కావడంతో ఇటీవల నగరంలో ఓ ఆస్పత్రిలో ఆపరేషన్ జరిగింది. తన కూతురును చూసుకోవడానికి శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం ఎలమంచిలి గ్రామానికి చెందిన గుణ నారాయణమ్మ(60) నాలుగు రోజుల క్రితం హనుమంతవాక వచ్చింది. ఆస్పత్రిలో ఉన్న తన కుమార్తెకు భోజనం వండి క్యారేజీ పంపిస్తుండేది. రాము కొన్నాళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం కోసం తన అత్త నారాయణమ్మను రోజూ డబ్బులు అడుగుతుండేవాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో రెండు రోజులుగా అత్తతో గొడవపడుతున్నాడు. శనివారం ఉదయం కూడా అతడు నారాయణమ్మతో గొడవ పడి అడిగిన డబ్బులు ఇవ్వనందుకు ఇంట్లో ఉన్న ఇనుప రాడుతో తలపై బలంగా కొట్టాడు. అధిక రక్తస్రావమై ఆమె కుప్పకూలింది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న ద్వారకా ఏసీపీ మూర్తి, ఆరిలోవ సీఐ సోమశేఖర్‌రావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నిందితుడు రామును అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఇదిలా ఉండగా హత్యకు ఉపయోగించిన రాడ్డు మాత్రం పోలీసులకు లభించలేదు. పోలీసులు క్లూస్ టీంను కూడా సంఘటన స్థలానికి రప్పించి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ సోమశేఖరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


మృతురాలు నారాయణమ్మ

బైబిల్ గ్రంథాలను తక్కువ ధరకు ఇస్తానని మోసం

తాటిచెట్లపాలెం : బైబిల్ గ్రంథాలను తక్కువ ధరకు ఇస్తానని కరపత్రాలు, ఫేస్‌బుక్ ద్వారా ప్రచారం చేసి డబ్బులు వసూలుచేసి మోసగించిన వ్యక్తిని సైబర్ క్రైమ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలు... మర్రిపాలేనికి చెందిన ఓ పాస్టర్‌కు ఫేస్‌బుక్‌లో బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా(బీఎస్‌ఐ) పాత ప్రింట్ బైబిల్స్‌ను ఒక్కోటి రూ.55కి ఇస్తానని ప్రకటన చూశాడు. చర్చి సభ్యులకు బైబిల్‌ను గిఫ్ట్‌గా ఇచ్చేందుకు గాను ఫేస్‌బుక్‌లో ఇచ్చిన ఫోన్ నెంబర్‌ను సంప్రదించి తాతపూడి విజయ్‌కుమార్ అనే వ్యక్తికి సుమారు 1.60 లక్షలు అకౌంట్‌లో జమ చేశాడు. చెప్పిన సమయానికి బైబిల్స్ రాకపోవడంతో అనుమానం వచ్చిన సదరు పాస్టర్ విజయ్‌కుమార్‌కు ఫోన్ చేయగా స్పందించలేదు. మోసపోయానని గ్రహించి సైబర్ క్రైమ్ పోలీసులను ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడు ఇటువంటి మోసాలకు పాల్పడుతూ చిరునామాలు మారుస్తున్నట్లు గుర్తించారు. నిఘా పెట్టిన పోలీసులకు నిందితుడు తాతపూడి విజయ్‌కుమార్, అతనికి సహకరించిన గర్భాపు శామ్యూల్‌రాజు, గర్భాపు సిద్ధులను కాకినాడ సమీపంలో అదుపులోకి తీసుకున్నారు.